ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024



అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- భవనాన్ని కూల్చివేయాల్సిందేనని ఎప్పుడో చెప్పిన దేవదాయ శాఖ సీఈ
- పట్టించుకోని దేవస్థానం అధికారులు



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు

-వార్త 7వ పేజీలో

పడకేసిన పేదల ఇళ్లు!

బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్

- అనకాపల్లి మండలం గొలగాం, పాపయ్యసంతపాలెంలో నాలుగుచోట్ల జగనన్న లేఅవుట్లు
- 3,750 మంది లబ్ధిదారులు
- ఇళ్ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించిన అధికారులు
- మొదటి విడతలో రూ.3.5 కోట్ల విలువ చేసే పనులు పూర్తి
- ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్
- ఆరు నెలల క్రితం రూ.1.5 కోట్లు మాత్రమే విడుదల
- మిగిలిన రూ.2 కోట్లు రాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- 185 ఇళ్లు శ్లాబ్ వరకు పూర్తి, పునాదుల స్థాయిలో 1,850 ఇళ్లు
- ప్రారంభం కాని మిగిలిన ఇళ్ల పనులు



పాపయ్యసంతపాలెం లేఅవుట్‌లో పునాదుల స్థాయిలో ఆగిన ఇళ్ల నిర్మాణ పనులు

- పట్టించుకోని అధికారులు
- దిక్కుతోచని స్థితిలో వేలాది మంది లబ్ధిదారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించిన పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పడకేశాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ పనులు నిలిపివేశారు. దీంతో వందలాది ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. ఇందుకు అనకాపల్లి మండలం గొలగాం, పాపయ్యసంతపాలెం జగనన్న లేఅవుట్లే ఒక ఉదాహరణ. లబ్ధిదారులు సొంతగా ఇంటి నిర్మాణ పనులు చేసుకోలేమని చెప్పడంతో ప్రభుత్వమే కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతలు అప్పగించి పనులు పూర్తి చేస్తామని ప్రకటించింది. అయితే చేసిన పనులకు ఎంతకాలమైనా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.



లేఅవుట్ వద్ద వృథాగా పడివున్న ఇనుము

జిల్లాలోని అనకాపల్లి మండలం గొలగాం, పాపయ్యసంతపాలెం గ్రామాల పరిధిలో సుమారు రెండేళ్ల క్రితం నాలుగు లేఅవుట్‌లలో 3,750 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారులకు మొదట ప్రభుత్వం మూడు ఆప్షన్లు ఇచ్చింది. మొదటి ఆప్షన్...ఇసుక ఉచితంగా సరఫరా చేయడం, రూ.20,250 విలువ చేసే 90 బస్తాల సిమెంటు, రూ.28 వేల విలువ చేసే అర టన్ను ఐరన్ అందజేసి మిగిలిన సొమ్మును (రూ.1,31,750) నాలుగు విడతల్లో చెల్లించడం. రెండో ఆప్షన్...ఇసుక ఉచితంగా సరఫరా చేసి, రూ.1.8 లక్షలతో లబ్ధిదారులకు నచ్చిన విధంగా ఇంటిని నిర్మించుకోవడం. మూడో ఆప్షన్...ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులకు అప్పగించడం. దీంతో ఎక్కువ మంది ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని దరఖాస్తుల్లో పేర్కొన్నారు. తీరా ఇళ్ల నిర్మాణం మొదలయ్యే సమయానికి మూడో ఆప్షన్ అమలుకు ప్రభుత్వం వెనకడుగు వేసింది. ఒకటి, రెండు ఆప్షన్లలో ఏదో ఒకదానిని ఎంచుకుని లబ్ధిదారులే ఇళ్లను నిర్మించుకోవాలని స్పష్టం చేసింది. అయితే గొలగాం, పాపయ్యసంతపాలెం లేఅవుట్లతో స్థలాలు, ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో అత్యధికులు రోజు వారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. దగ్గరుండి ఇళ్లు నిర్మించుకోవాలంటూ కూలి పనులు మానేయాలి. ఈ విషయం వైసీపీ నేతలు, గృహనిర్మాణ సంస్థ అధికారుల దృష్టికి రావడంతో, ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌తో చేయిస్తామని చెప్పారు. అయితే ప్రభుత్వం ఇచ్చే రూ.1.8 లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని, ఒక్కో ఇంటికి మరో రూ.35 వేల చొప్పున ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ సొమ్మును డ్వాక్రా సంఘాల ద్వారా మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక వైసీపీ నేతకు ... మిగతా 6వ పేజీలో

ఆత్మీయ పలకరింపు

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం

- రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మునగపాక మండలాల్లో 11 కుటుంబాలకు పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- పార్టీ అండగా ఉంటుందని భరోసా



మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో ముతుర్తి వెంకటరావు భార్యకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటనకు జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా తొలిసారి జిల్లాకు వచ్చిన ఆమెకు టీడీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజులపాటు అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెంది ప్రాణాలు వదిలిన 11 మంది టీడీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులు అందించారు. బాధిత కుటుంబాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం ఉదయం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో ప్రారంభించిన పర్యటన శుక్రవారం మధ్యాహ్నం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలంలో ముగిసింది.

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం కొవ్వూరులో నారా భువనేశ్వరిని చూసేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు. జై తెలుగుదేశం, జై చంద్రబాబు, సైకో పోవాలి... సైకిల్ రావాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. తనను చూడానికి వచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కొవ్వూరు పర్యటన ముగించుకొని ముందుకు సాగుతుండగా దారిలో రోలుగుంట శివారు చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి పథకం కూలీలు రోడ్డుపైకి వచ్చి భువనేశ్వరిని కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రోలుగుంట మండలం కొవ్వూరు, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామాల్లో పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ, కష్ట కాలంలో కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, మన పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయకత్వం అవసరమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా వుందని అన్నారు. మునగపాక మండలం కాకరాపల్లిలో వాసా అప్పారావు కుమార్తె సునీతను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. భువనేశ్వరి పర్యటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నియోజకవర్గా ఇన్‌చార్జిలు బత్తుల తాతయ్యబాబు (చోడవరం), పీలా గోవింద సత్యనారాయణ (అనకాపల్లి), ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), పీవీజీ కుమార్ (మాడుగుల), మాజీ ఎమ్మెల్యేలు రామానాయుడు, కేఎస్ఎన్ఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, సీనియర్ నాయకులు, కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, ఆడారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మునగపాక మండలం తోటాడలో పెంటకోట వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నారా భువనేశ్వరి

అనకాపల్లికి కేంద్ర బలగాలు



కేంద్ర బలగాలకు సూచనలిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

- ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా రాక
- స్థానిక పోలీసులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ మురళీకృష్ణ సూచన

అనకాపల్లి టౌన్, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర పోలీస్ బలగాలు (సీఐఎస్ఎఫ్) శుక్రవారం సాయంత్రం అనకాపల్లికి చేరుకున్నాయి. ఎన్నికల సమయంలో స్థానిక పోలీసులతో సమన్వయం గురించి ఎస్పీ కేవీ మురళీకృష్ణ కేంద్ర పోలీస్ దళాలకు అవగాహన కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వున్న పరిస్థితుల గురించి వివరించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రశాంతవాతావరణంలో జరిగేందుకు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వీరికి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీలో వసతి ఏర్పాట్లు చేశారు. లైజన్ ఆఫీసర్లను నియమించి ఎటువంటి అవసరం ఏర్పడినా వెంటనే తనకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, పట్టణ సీఐ జి.శంకరరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 13,624 మంది హాజరు

అనకాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 38 కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 14,090 మంది పరీక్షలకు హాజరు కావాల్సి వుంది. వీరిలో 13,624 మంది హాజరయ్యారు. 466 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 11,380 మందిలో 11,080 మంది పరీక్ష రాయగా, 300 మంది రాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 2,710 మందికిగాను 2,544 మంది పరీక్ష రాశారు. 166 మంది రాలేదు.

ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళ్లడానికి వరుసలో నిల్చున్న విద్యార్థినులు

మినీ స్టేడియంపై నిర్లక్ష్యం

- వాకింగ్ ట్రాక్ కాంక్రీట్ ధ్వంసం
- మట్టిపోసి.. ర్యాంపుగా మార్పు
- ప్రైవేటు వాహనాల రాకతో డ్రైనేజీ ఛిద్రం
- ప్రహరీ గోడ, ప్రధాన గేటు లేకపోవడంతో రక్షణ కరువు
- రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారిన స్టేడియం
- ఇబ్బంది పడుతున్న వాకర్స్, క్రీడాకారులు

నిర్వహణను గాలికొదిలేసిన మునిసిపల్ అధికారులు



గ్యాలరీ మెట్లపై మట్టిపోసి ర్యాంప్‌గా మార్చి వాకింగ్ ట్రాక్

నర్సీపట్నం, మార్చి 1: **పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నిర్లక్ష్యానికి గురవుతోంది. మునిసిపల్ అధికారులు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు వల్ల స్టేడియం రూపురేఖలు మారిపోయి అధ్వానంగా తయారవుతున్నది. మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డివైడర్లు మీద తొలగించిన విగ్రహాలను స్టేడియంలోకి తరలించడానికి వాకింగ్ ట్రాక్ కాంక్రీట్ గట్టును ధ్వంసం చేశారు. ఇటీవల ఒక ప్రైవేటు స్కూల్ వార్షికోత్సవానికి స్టేడియంను అద్దెకు ఇచ్చారు. సామగ్రి తెచ్చిన వాహనాలు డ్రైనేజీ మీదగా వెళ్లడంతో సిమెంటు పలకలు ధ్వంసం అయ్యాయి. ప్రహరీగోడ, గేట్ లేక పోవడంతో రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారింది. మరుగుదొడ్ల నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో కంపు కొడుతున్నాయి.**



డ్రైనేజీ కాలువ మీద ధ్వంసమైన సిమెంట్ పలకలు

నర్సీపట్నం మునిసిపాలిటీలో సుమారు 75 వేల మంది జనాభా వున్నారు. కానీ ప్రజలు సాయంత్రపూట సేద తీరడానికి ఒక్క పార్కు కూడా లేదు. వాకింగ్‌కు, విశ్రాంత ఉద్యోగులు సాయంత్రం పూట సేద తీరడానికి, పిల్లలు ఆడుకోవడానికి ఎన్టీఆర్ మినీ స్టేడియం మాత్రమే వుంది. రోజు వందలాది మంది మహిళలు, యువతీ యువకులు, క్రీడాకారులు, సీనియర్ సిటిజన్స్ ఇక్కడి వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. సాయంత్రం విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఇక్కడకు వచ్చి సేద తీరుతుంటారు. తల్లిదండ్రులు స్టేడియంలోకి చిన్న పిల్లలను తీసుకొచ్చి ... మిగతా 6వ పేజీలో



వాకింగ్ ట్రాక్ గట్టు ధ్వంసం చేసి వదిలేసిన కాంక్రీట్ దిమ్మలు

పేరుకే డిగ్రీ కాలేజీ!

మూడేళ్లయినా స్థలం సమకూర్చని ప్రభుత్వం



జూనియర్ కళాశాల భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- జూనియర్ కళాశాల భవనాల్లో తరగతులు
- ల్యాబ్ లేక సైన్స్ విద్యార్థుల ఇబ్బందులు
- నలుగురే రెగ్యులర్ అధ్యాపకులు
- సగం మందికిపైగా గెస్ట్ లెక్చరర్లు
- ప్రవేశాలకు ఆసక్తి చూపని విద్యార్థులు
- ఫస్టియర్‌లో 64 శాతం సీట్లు ఖాళీ
- రెండు, మూడు సంవత్సరాల్లోనూ అదే పరిస్థితి

నక్కపల్లి, మార్చి 1: **నక్కపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటై మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ సొంత భవనాలకు నోచుకోలేదు. ఇంతవరకు కనీసం స్థలం కూడా సమకూర్చలేదు. జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. సైన్స్ ల్యాబ్ లేదు. అధ్యాపకుల్లో అత్యధికులు గెస్ట్ లెక్చరర్లు. దీంతో ఇక్కడ చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. దీంతో మూడు సంవత్సరాల్లో కలిపి దాదాపు 70 శాతం సీట్లు ఖాళీగా వున్నారు.**

నక్కపల్లిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తూ 2020లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021-22 విద్యా సంవత్సరంలో ఇక్కడే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. బీఎస్సీలో మ్యాథ్స్, కెమిస్ట్రీ, బొటనీ, బీకామ్ కంప్యూటర్ కోర్సులు ఉన్నాయి. కంప్యూటర్ కోర్సులో 60 సీట్లు, మిగిలిన కోర్సుల్లో 40 చొప్పున ఒక్కో ఏడాదికి 180 సీట్లు వున్నాయి. రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. సొంత భవనాల కోసం ఇంతవరకు స్థలం సమకూర్చలేదు. హైవేను ఆనుకుని కేజీబీవీ వద్ద స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ అధికారికంగా ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

మద్యం మత్తులో భర్త దారుణం

- భార్యతో తరచూ గొడవలు
- అర్ధరాత్రి నిద్రిస్తుండగా కుటుంబంపై పెట్రోల్ పోసి, నిప్పు
- కాలిన గాయాలతో ఆస్పత్రిలో ముగ్గురు చేరిక
- పోలీసుల అదుపులో నిందితుడు


కాలిన గాయాలతో భార్య విజయ్

మాకవరపాలెం, మార్చి 1 : భార్య భర్త మధ్య జరిగిన గొడవ కుటుంబ సభ్యులపై పెట్రోల్ పోసి, నిప్పంటించే స్థితికి తీసుకు వెళ్లింది. మాకవరపాలెం మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. రాచపల్లికి చెందిన తంగేళ్ల రమణ, అతని భార్య విజయ్‌లకు గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. లారీ డ్రైవర్‌గా పని చేసే రమణ విధుల అనంతరం ఇంటికి వచ్చినప్పుడల్లా భార్యతో గొడవ పడేవాడని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. అయితే మూడు రోజుల కిందట ఇదే క్రమంలో భార్యతో గొడవకు దిగాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లిపోతున్నానని చెప్పిన రమణ బయటకు వచ్చేశారు. గ్రామంలో మద్యం సేవించి, రాత్రి 11 గంటల సమయంలో మద్యం మత్తులో తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటికే అతని భార్య విజయ్, పదకొండు సంవత్సరాల కుమార్తె శ్రీకావ్య, అతని అత్త రావాడ కృష్ణమ్మ ఇంట్లో ఒకేచోట నిద్రిస్తున్నారు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ముగ్గురిపై పెట్రోల్ పోసి తగులబెట్టే ప్రయత్నం చేశాడు. పెట్రోల్ ఒంటిపై పోసి, ఆ వెంటనే నిప్పు అంటించడంతో ఒక్కసారిగా భార్య ఉలిక్కిపడి లేచి కేకలు వేసింది. దీంతో చుట్టపక్కల ఉన్నవారు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే కుమార్తె ఒంటి నిండా కాలిన గాయాలు అయ్యాయి. అలాగే అతని భార్యతో పాటు అత్తకు కూడా కొన్ని చోట్ల కాలిపోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి గాయాలపాలైన ముగ్గురినీ 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. భార్య విజయ్ ఫిర్యాదు మేరకు భర్త రమణపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కాశీబాబు

చింతపల్లి, మార్చి 1: మండలంలోని కొమ్మంగి ఘాట్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లోతుగెడ్డ గ్రామానికి చెందిన డ్రైవర్ సిరికి కాశీబాబు సర్వీసు ఆటోలో శుక్రవారం లోతుగెడ్డ జంక్షన్ నుంచి కొమ్మంగి ప్రయాణమయ్యాడు. ప్రయాణికులను కొమ్మంగి ఘాట్ రోడ్డు ముందు గ్రామంలో దించేసి, ఒక్కడే వాహనంలో వెళ్తున్నాడు. కొంత దూరం వెళ్లాక అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఆటో కింద పడిపోయి ఉన్న కాశీబాబును సుమారు రెండు గంటల తరువాత అటుగా వస్తున్న మరో ఆటో డ్రైవర్ బయటకు తీసి చింతపల్లి ఆస్పత్రికి తీసుకొచ్చాడు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అనంతరం స్థానిక వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్ష

విశాఖపట్నం (లీగల్) మార్చి 1: హత్యానేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతానికి చెందిన నిందితులు ఆదినారాయణ, శ్రీను, మోహన్‌కుమార్ చెడువ్యసనాలకు బానిసలై పూటుగా మద్యం సేవిస్తూ గొడవలకు దిగుతుంటారు. పోలీసులు గతంలో వీరిపై రౌడీషీట్లు కూడా తెరిచారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 19న వీరు ఆరిలోవలో మద్యం సేవిస్తూ గొడవపడి వినయ్ అనే వ్యక్తిని హత్యచేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ సమయంలోనే ఆదినారాయణ చనిపోయాడు. మిగిలిన ఇద్దరిపై చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.2 వేల చొప్పున జరిమానా కూడా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

విశాఖపట్నం, మార్చి 1: బాలిక (10) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని దువ్వాడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ ఎర్రన్నాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదగంట్యాడ మండలానికి చెందిన బాలిక శుక్రవారం ఆడుకుంటుండగా అదే మండలానికి చెందిన తోహిదు షేక్ (30) ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక తన తల్లి వద్దకు వెళ్లి విషయం చెప్పింది. దీంతో ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడ్ని దిశ పోలీసులకు అప్పగించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 1: గురుకుల పాఠశాలలు, జూనియరు, డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని భీమిలి ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ కోడి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా రన్నారు. అలాగే ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా ఏడు గురుకుల జూనియరు కళాశాలలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు https://aprs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెలాఖరు వరకూ దరఖాస్తులకు గడువు ఉందన్నారు. కాగా 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశపరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగిలి వున్న ఖాళీల భర్తీకి, జూనియరు కళాశాలల్లోనూ మైనారిటీ కోటా సీట్లు ప్రవేశాలకు అర్హులైన వారు పరీక్ష రాయనవసరం లేదన్నారు. వారు నేరుగా మే 1 నుంచి ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి నేరుగా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

విశాఖ- పలాస ప్రత్యేక పాసింజర్ రైళ్లు బ్రహ్మాపూర్ వరకు పొడిగింపు

విశాఖపట్నం, మార్చి 1: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న 08532, 08531 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను వయా సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా బ్రహ్మాపూర్ వరకు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బ్రహ్మాపూర్ ప్రత్యేక పాసింజర్ (08532) రైలు ఈనెల మూడు నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 11.10 గంటలకు బ్రహ్మాపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మాపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08531) రైలు ఈనెల నాలుగు నుంచి ప్రతిరోజు తెల్లవారుజాము 3.50 గంటలకు బ్రహ్మాపూర్‌లో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు ఇరువైపులా మందస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవుపల్లి వద్ద యథేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం

- బస్తాల్లో విక్రయాలు సాగిస్తున్న వైనం
- మినీ వ్యాన్, ఆటోలతో కూడా రవాణా
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు


కొత్త సోముదేవుపల్లి వద్ద నదిలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రదేశం


కొత్త సోముదేవుపల్లి సమీపంలో వరహానది గట్టు పక్కనే ఉన్న ఇసుక బస్తాలు

ఎస్.రాయవరం, మార్చి1: మండలంలోని పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవుపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వరహానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన పలువురు వరహానదిలో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు చేసి ఖాళీ గోనె సంచుల్లో నింపి బస్తా ఇసుక రూ.20చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ఇసుక బస్తాలను చుట్టుపక్కల గ్రామాల్లో రూ.50 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టడం వలన వరహానదిలో ఎక్కడ చూసినా ప్రమాదకరమైన గోతులు దర్శనమిస్తున్నాయి. పట్ట పగలు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రణ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ తవ్వకాలపై గత ఏడాది జూలై నెలలో ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురించిన ‘వరహా నదికి తూట్లు’ వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు కొద్ది రోజులు మాత్రమే ఆ గ్రామాల్లో ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టగలిగారు. ఇప్పటికైన వరహానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


నిల్వ చేసి ఉంచిన ఇసుక బస్తాలను మినీ వ్యాన్‌కు లోడ్ చేస్తున్న దృశ్యం

విద్యాదీవెనలో 39,773 మందికి లబ్ధి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


నమూనా చెక్కును విద్యార్థుల తల్లులు, విద్యార్థులకు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 1: జిల్లాలో విద్యాదీవెన పథకంలో 39,773 మంది విద్యార్థులకు రూ.26.54 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక కారణాలతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టిందన్నారు. అంతకుముందు కృష్ణా జిల్లా పామర్రు నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకం ప్రారంభించగా.. ఆ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్, వివిధశాఖల అధికారులు, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ రాజేశ్వరి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు ప్రమాణస్వీకారం


చాంబర్‌లో తొలిసారిగా మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

కోటవురట్ల, మార్చి 1: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, సాగి రామచంద్రరాజు, కిల్లాడ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు డీవీ సూర్యనారాయణరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కీలకమైన పదవిని అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

వైసీపీ విముక్త ఏపీయే లక్ష్యం కావాలి

- జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు


వైసీపీని వీడి జనసేనలో చేరిన వారితో పీవీఎస్ఎన్ రాజు

బుచ్చెయ్యపేట, మార్చి 1: వైసీపీ విముక్తి ఏపీయే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పిలుపు నిచ్చారు. మండలంలోని వడ్డాదిలో శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి సయ్యపురెడ్డి నవీన్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు రసూల్ తన 50 మంది అనుయాయులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వీరికి రాజు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అవినీతి, నియంత పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. టీడీపీ పాలనలో 5.5 లక్షల టన్నుల క్రషింగ్ చేసిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ, ప్రస్తుత వైసీపీ పాలనలో లక్షన్నర టన్నులు క్రషింగ్‌కే అపోసోపాలు పడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. వడ్డాదిలో కస్పా గ్రోయిన్, పెద్దేరుపై వంతెన, విజయరామరాజుపేట వంతెన, రహదార్ల అభివృద్ధికి టీడీపీ, జనసేన కూటమి కట్టుబడి ఉందన్నారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అంతా పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు అడపా నర్సింహమూర్తి, గునూరు మూలునాయుడు, అల్లం రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు.... పెచ్చులూడిన పైకప్పు

సింహాచలం, మార్చి 1: సింహాచలం దేవస్థానానికి చెందిన కేశఖండనశాలలో శుక్రవారం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో అక్కడ భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో కేశఖండనశాలలో కొందరు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అదే సమయంలో భవనం తూర్పు వైపు పైభాగంలో పెచ్చులూడిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఈఓ శ్రీనివాసమూర్తి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, కేశఖండనశాల భవనానికి 1986లో శంకుస్థాపన చేయగా 1987లో అప్పటి అనువంశిక ధర్మకర్త డాక్టర్ వీవీజీ రాజు ప్రారంభించారు. సుమారు ఏడాది క్రితం కొండపై అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం సీఈ కేశఖండనశాల భవనాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉందని, తక్షణం కూల్చివేయాల్సిందిగా చెప్పారు. కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోలేదు. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో క్షురకులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.

అంతర్ పంటలతో అదనపు ఆదాయం

- బుచ్చెయ్యపేట మండలంలో ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో సాగు
- వాటర్ మిలన్, అపరాల పంటలు పండిస్తున్న రైతులు
- లాభదాయకంగా ఉందని పలువురు ఆనందం


చినఅప్పన్నపాలెంలో కొబ్బరి మొక్కల తోటలో సాగులో ఉన్న వాటర్‌మెలన్

బుచ్చెయ్యపేట, మార్చి 1: మండలంలోని పలువురు రైతులు వరి పంటతో పాటు ఇతర పంటలవైపు కూడా దృష్టి సారిస్తున్నారు. ఒకే పంటను నమ్ముకోకుండా అంతర పంటల సాగు ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో ఇతర పంటలను సాగు చేస్తూ లాభాలను పొందుతున్నారు. ఆయిల్ పామ్, కొబ్బరి సాగు అన్ని కాలాలకు అనుకూలం. తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ అయితే 30 ఏళ్ల, కొబ్బరి అయితే 60 ఏళ్ల వరకూ స్థిరమైన ఆదాయం ఉంటుంది. ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి ద్వారా నికరంగా రూ.లక్ష దాకా సంపాదించవ చ్చు. అయితే పంట వేసిన నాలుగేళ్ల తర్వాతే దిగుబడి ఆరంభమవుతుంది. ఈ నైపథ్యంలో మొదటి మూడేళ్ల పాటు అంతర పంటలను సాగుచేయడం వల్ల అధిక లాభాలను ఆర్జించవచ్చు. బుచ్చెయ్యపేట మండలంలోని లోపూడి, బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, కొండెంపూడి, వడ్డాది, చినఅప్పన్నపాలెం, ఎల్‌బీపీ అగ్రహారం, పి.భీమవరం, కోమళ్లపూడి తదితర గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటల్లో పుచ్చకాయ పంట (వాటర్ మిలన్)తోపా కూరగాయలు, అపరాలు సాగు చేస్తున్నారు. దీని ద్వారా ఎకరాకు రూ.20 వేలు అదనపు ఆదాయం వస్తుందని బంగారుమెట్టకు చెందిన రైతు సాయం సత్యనారాయణ తెలిపారు.


బంగారుమెట్టలో ఆయిల్ ఫామ్ మొక్క తోటలో పండిస్తున్న పుచ్చ పంట


అచ్యుతాపురంలో భువనేశ్వరిని కలిసిన టీడీపీ, జనసేన నాయకులు

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ, జనసేన నాయకులు

అచ్యుతాపురం/ అనకాపల్లి టౌన్, మార్చి 1: నిజం గెలవాలి పర్యటనలో భాగంగా అచ్యుతాపురం వచ్చిన నారా భువనేశ్వరిని శుక్రవారం ఉదయం టీడీపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆమె మునగపాక మండలంలో పలువురిని పరామర్శించి, రాత్రికి అచ్యుతాపురం పూడిమడక రోడ్డులో ఒక హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి, దాడి వీరభద్రరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి నరసింగరావు, ధర్మిరెడ్డి నాయుడుబాబు, జనసేన నాయకుడు సుందరపు విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అల్పాహారం తీసుకున్న తర్వాత తిరిగి మునగపాక మండలానికి వెళ్లారు.

పూడిమడక తీరంలో తాబేళ్ల కళేబరాలు


- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు


పూడిమడక తీరంలో కొట్టుకువచ్చిన తాబేళ్ల కళేబరాలు

అచ్యుతాపురం, మార్చి 1: పూడిమడక తీరంలో తాబేళ్ల మృతకళేబరాలు కొట్టుకు రావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పూడిమడక తీరంలో రెండు రోజుల నుంచి వరుసగా తాబేళ్ల మృతదేహాలు తీరానికి కొట్టుకువస్తున్నాయి. ఇటీవల అచ్యుతాపురం మండలం తంతడి శివారు వాడపాలెం తీరానికి కూడా తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. సాధారణంగా తాబేళ్లు చనిపోవు. సముద్రంలో భారీ షిప్‌ల కింద ప్రమాదవశాత్తు తగిలితేనే చనిపోతాయని, ఇది చాలా అరుదని మత్స్యకారులు తెలిపారు. గుడ్లుపెట్టే సమయంలో తీరానికి వచ్చినప్పుడు కూడా తాబేళ్లు చాలా అప్రమత్తంగా ఉంటాయని వారు తెలిపారు. కేవలం కర్మాగారాల కాలుష్యం వల్లే తాబేళ్లు చనిపోతున్నాయని వారంటున్నారు. పరవాడ వద్ద గల ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్‌లో కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాల కారణంగా తాబేళ్లు చనిపోతున్నాయని మత్స్యకార నాయకుడు చోడిపల్లి అప్పారావు ఆరోపించారు. ముత్యాలమ్మపాలెం, పూడిమడక, వాడపాలెం తీరాల్లో తాబేళ్లు చనిపోతున్నాయని ఆయన అన్నారు. వ్యర్థాల వల్ల మత్స్య సంపద కూడా నశించి మత్స్యకారులు చేపల వేట కూడా సక్రమంగా సాగటంలేదన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే మత్స్యకారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 25న గురుకుల విద్యాలయాల ప్రవేశపరీక్ష

- డీఈవో వెంకటలక్ష్మమ్మ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి రూరల్, మార్చి 1: ఏప్రిల్ 25వ తేదీన జరిగే ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె గురుకుల విద్యాలయాల సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులాలలో విలువలతో కూడిన విద్య, ఉచిత వసతి, సంరక్షణ, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఉన్నత పాఠశాల విద్యకు ఏపీఆర్ఎస్‌కేట్ (ఏపీఆర్‌జేసీఏటీ), ఇంటర్మీడియట్, డిగ్రీలకు ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ (ఏపీఆర్‌జే అండ్ డీసీ సీఈటీ) ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షలు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో తాటిపూడి ప్రిన్సిపాల్ డి.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు


ముంచంగిపుట్టు-కుమడ మార్గంలో తనిఖీల దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మండల కేంద్రం నుంచి కుమడ, లక్ష్మీపురం, పెదబయలు, జోలాపుట్టు తదితర ప్రాంతాల వైపు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. రహదారులతో పాటు కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనల కింద, వాటి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు బలగాలు స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు ప్రధాన జంక్షన్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహిస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

ప్రజా పోరాటంతో రోడ్డు పునర్నిర్మాణం

» సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, మార్చి 1 : అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డును పునర్నిర్మించాలనే పోరాటం విజయవంతమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం అన్నారు. సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోడ్డు విస్తరణ పేరుతో అత్యంత అధ్వానంగా తయారైన రోడ్డును నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఇటీవల అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు చేయడంతో ఎట్టకేలకు గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే రోడ్డు పనులను ప్రారంభించడాన్ని సీపీఎం హర్షిస్తుందన్నారు. భారీ వాహనాలు రాకుండా కట్టడి చేయడంతోపాటు ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం కూడా చూపాలని కోరారు. ఎస్ఈజడ్, ఫార్మా కంపెనీలకు వెళ్లే భారీ వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం గాని లేదా భవిష్యత్తులో రోడ్డు విస్తరణ చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, ఆర్. శ్రీను పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవహన ర్యాలీ

ఎస్.రాయవరం, మార్చి 1: ఈనెల మూడో తేదీన జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలో పోలియో చుక్కలను వేసేందుకు ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాలు, వలంటీర్లను నియమించామన్నారు.

ఇన్‌చార్జి ఏసీపీగా రామకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 1: జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఇన్‌చార్జి ఏసీపీగా ఏ.రామకృష్ణ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం జీవీఎంసీ ఐదో జోన్‌లో పనిచేస్తుండగా అనకాపల్లికి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఇప్పటికే ఈయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ ఝాన్సీ జీవీఎంసీ నాల్గో జోన్‌కు బదిలీ అయినట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

9 నుంచి భవన నిర్మాణ కార్మికులకు కొత్త రేట్లు

» అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు


పెరిగిన కూలీ రేట్లను విడుదల చేస్తున్న నారాయణరావు

పాయకరావుపేట, మార్చి 1 : పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పెంచిన భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్ల ఈనెల 9వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయని శ్రీసాయి శ్యామల తుని, పాయకరావుపేట తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పెంచిన భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్ల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ మేస్త్రీకి రోజుకు రూ.850, మగకూలీకి రూ.700, ఆడకూలీకి రూ.550లకు పెంచడం జరిగిందన్నారు. ఈ రేట్లు ఈనెల 9వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని, భవన నిర్మాణదారులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూండ్రపు చిన్నారావు, చంటి, చందా శ్రీనివాసరావు, మేకల సత్తిబాబు, దేవాని నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుకు వైసీపీ సర్కార్ తూట్లు

» ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం


మామిడిపాలెంలో సమావేశమైన కార్మికులు

తుమ్మపాల, మార్చి 1 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు తూట్లు పొడిచి, కార్మికుల సంక్షేమ ఫలాలు అందకుండా చేసిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దించేందుకు కార్మికులంతా సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం పిలుపునిచ్చారు. శుక్రవారం మామిడిపాలెంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి సంక్షేమ బోర్డును నిలిపివేశారని ఆరోపించారు. ప్రమాదాల్లో మరణించిన వారికి, గాయాలపాలైన వారికి బీమా పరిహారాన్ని నిలిపివేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక పాలసీ ద్వారా నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. తక్షణమే మళ్లించిన నిధులను సంక్షేమ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు గోపాలం మహాలక్ష్మి, ఎం.అప్పారావు, అప్పలకొండ, వెంకటరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల చందనం ఊరేగింపు


ఇస్లాంపేటలో ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

కొత్తూరు, మార్చి 1 : అనకాపల్లి మండలం కొత్తూరు శారదా నగర్ ఇస్లాంపేట మదీనా మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి చందనం ఊరేగింపు ఘనంగా జరిగింది. మసీదు సంప్రదాయంలో భాగంగా పంచాయతీ నుంచి అనకాపల్లి పట్టణంలో చందనం, వస్త్రాలు పండ్లు, నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి కశింకోట మండలం బయ్యవరం హజరత్‌అన్సర్ మసీదులో జరుగుతున్న 72వ ఉరుస్ చందనోత్సవంలో సమర్పించినట్టు మతపెద్దలు తెలిపారు. ముందుగా ఇస్లాంపేటలో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

తగరంపూడి పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీపీ

కొత్తూరు, మార్చి 1: మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీని ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం జరిగిన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని కమిటీ సభ్యులతో చర్చించి కొనుగోలు చేసేందుకు తీర్మానం చేశారు. తర్వాత ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్, వైద్యులు జి.పావని, డి.నీలిమరాణి, వైస్ ఎంపీపీ ఆనందరాము, ఎంపీటీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

» పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ


అనకాపల్లి మహిళా కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థినులు


అనకాపల్లి మహిళా కళాశాలను తనిఖీకి వచ్చిన కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 1 : పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆదినారాయణ మహిళా కళాశాల, శ్రీచైతన్య, సర్వేపల్లి, హిమశేఖర్, సంయుక్త, నారాయణ, శ్రీకన్య విద్యాసంస్థల్లో పరీక్షలు జరిగాయి. విద్యార్థులను ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఆదినారాయణ మహిళా కళాశాల, శ్రీచైతన్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ శ్రీచైతన్య, శ్రీకన్య, నారాయణ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. డీవీఈవో సుజాత పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరవాడలో..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 396 మంది విద్యార్థులకుగాను 390 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరందరికీ పది గదులను ఏర్పాటు చేసినట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జామి లక్ష్మీకుమారి తెలిపారు.

నక్కపల్లిలో..

నక్కపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకున్నారు. నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు కేంద్రాలలో పోలీసు బందోబస్తు ఏర్పా టు చేశారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురంలో ఇంటర్ పరీక్షలు స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 385 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 360 మంది హాజరయ్యారు. అలాగే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపారు. ఈ సందర్భంగా సిక్ అయిన ఇద్దరు విద్యార్థులకు పరీక్ష గదుల్లోకి పంపారు.


నక్కపల్లి గురుకులం వద్ద గుమ్మిగూడి విద్యార్థులు

ఎలమంచిలిలో..

ఎలమంచిలిలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మునిసిపల్ కమిషనర్ కొండలరావు, పట్టణ ఎస్ఐ పాపినాయుడు పర్యవేక్షించారు. తొలిరోజు రెండు పరీక్షా కేంద్రాల్లోనూ 863 మందికి గాను, 856 మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య తదితర అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు.

సబ్బవరంలో..

మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురుకుల కళాశాల/పాఠశాల్లో 253 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా.. మొదటి రోజు పరీక్ష 9 మంది గైర్హాజరయ్యారు. జూనియర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 351మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా.. మొదటి రోజు 21 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్స్ సీహెచ్‌వీవీ సత్యారావు, వర్మ తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

పాయకరావుపేటలో..

పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 959 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 509 మంది విద్యార్థులకు గాను 502 మంది, కార్తికేయ జూనియర్ కళాశాలలో 450కి 447 మంది హాజరయ్యారు.


అచ్యుతాపురంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


సబ్బవరం గురుకుల కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థినులు


ఎలమంచిలిలో హాల్‌టిక్కెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

దళితులు బాగుపడాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలి

» తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వి.అనిత

పాయకరావుపేట, మార్చి 1 : దళితులు సామాజికంగా, ఆర్థికంగా బాగుపడాలంటే రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని దుర్గాకాలనీ, అంబేద్కర్‌కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అనితమ్మ పల్లె పలకరింపు కార్యక్రమంలో ఆమె ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అనిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళిత వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి కనీసం మాట్లాడడని అన్నారు. సీఎం సొంత నియోజకవర్గం పులివెందలలో నాగమ్మ అనే మహిళను అతిదారుణంగా చంపినపుడు బాధిత కుటుంబాన్ని తాను పరామర్శించడానికి వెళితే దళితురాలినైన తనపైనే అట్రాసిటీ కేసు పెట్టించాడని ఆరోపించారు. ఒక్క చాన్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దళితులకు చెందిన సంక్షేమ పథకాలు రద్దు చేశాడన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. స్థానిక టీడీపీ దళిత నాయకులు సూరా సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు కశింకోట సత్తిబాబు, గంపల చినరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనితకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు గొర్రెల రాజబాబు, యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు వెంకట్రావు, బొంది కాశీవిశ్వనాథం, పల్లా విలియంకేరి, సూరా సుబ్రహ్మణ్యం, ఎం.రమాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందజేయాలని భవన నిర్మాణ కార్మికుల నిరసన



కశింకోట: నర్సింగబిల్లి సచివాలయం వద్ద నిరసన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు


రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కశింకోట, మార్చి 1 : సంక్షేమ బోర్డు పథకాలు తక్షణమే అమలు చేయాలని నర్సింగబిల్లి సచివాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణ, ఎం.గోవింద మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా చనిపోయిన వారికి, ప్రమాదంలో గాయపడిన వారికి, డెలివరీలకు, వివాహాలకు ఆర్థిక సహాయం అందేదన్నారు. 2019 నుంచి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.వంశీకృష్ణ, టి.రమణ, కె.రాజు, ఎన్.చిన్నారావు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, భవన నిర్మాణ సంఘం నాయకులు ఎస్. రాంబాబు, చందక రామకృష్ణ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నుంచి కార్మికులకు అమలు చేయాల్సిన పథకాలను అమలు చేయలేదన్నారు. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పడకేసిన పేదల ఇళ్లు!

... 5వ పేజీ తరువాయి

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్‌ను అప్పగించారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నేరుగా బిల్లులు చెల్లించకూడదు. దీంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు దశల వారీగా బిల్లులు మంజూరు అవుతాయని, అనంతరం 'ఆటో డెబిట్' కింద వెంటనే ఆ మొత్తం సొమ్ము ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బ్యాంకు ఖాతాలకు మళ్లించేలా బ్యాంకర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ మేరకు లబ్ధిదారుడు, కాంట్రాక్టరు, గృహనిర్మాణ సంస్థ జేఈలు ఒప్పంద పత్రాల(ఎంఓయూ)లపై సంతకాలు చేశారు. గొలగాంలోని మూడు లేఅవుట్లలో 3,300 మందికి స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేశారు. వీటిల్లో ఇంతవరకు 185 ఇళ్లు మాత్రమే శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. పాపయ్యసంతపాలెం లేఅవుట్‌లో మొత్తం 450 ఇళ్లు వుండగా 50 ఇళ్లు పునాదుల వరకే పనులు జరిగాయి. మొత్తం మీద 1,850 ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. మిగిలిన ఇళ్ల (సుమారు 1,700) నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. కాంట్రాక్టర్ మొదటి విడత కింద రూ.3.5 కోట్ల విలువ చేసే పనులు పూర్తయిన తరువాత బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఆరు నెలల కిందట రూ.1.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగిలిన రూ.2 కోట్లు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. లేఅవుట్ల వద్ద ఇనుము, సిమెంట్, ఇసుక, పిక్క వృథాగా పడివున్నాయి. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడం, కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు ఆపేయడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

మినీ స్టేడియంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఆడిస్తుంటారు. అప్పుడప్పుడు రాజకీయ పార్టీల సభలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఇక్కడ నిర్వహిస్తుంటారు. ఇన్ని రకాల అవసరాలు తీరుస్తున్న ఎన్టీఆర్ మినీ స్టేడియం మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఇటీవల మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డివైడర్లు మీద వున్న మూడు విగ్రహాలను తీసి, మునిసిపల్ ఏఈ రవి ఆదేశాలతో స్టేడియంలో తరలించారు. వాహనాలు లోపలికి రావడానికి వాకింగ్ ట్రాక్ కాంక్రీట్ గట్టును ధ్వంసం చేసి, మట్టితో నింపేశారు. 15 నుంచి 20 అడుగులు ఐరన్ రెయిలింగ్ రాడ్లు కట్ చేసి పట్టుకు పోయారు. వాకింగ్ ట్రాక్ మీద మట్టి పోయడం వల్ల వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక ర్యాంప్ మాదిరిగా వుండడంతో ఆకతాయులు ద్విచక్రవాహనాలతో నేరుగా స్టేడియంలోకి వచ్చేస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం స్టేడియం ప్రహరీగోడ, గేటు తీసేశారు. మునిసిపల్ అధికారులు ఇటీవల ఒక ప్రైవేటు స్కూల్ వార్షికోత్సవానికి నామమాత్రపు రుసుముతో స్టేడియంను అద్దెకు ఇచ్చారు. డీజే సౌండ్ సిస్టమ్, టెంట్ సామగ్రితో వచ్చిన వాహనాలు డ్రైనేజీ మీద నుంచి వెళ్లడంతో సిమెంటు పలకలు ధ్వంసం అయ్యాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రహరీగోడను, ప్రధాన గేటును తొలగించారు. దీంతో రాత్రిపూట మందుబాబులు స్టేడియంలోకి వచ్చి మద్యం సేవిస్తున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయండి

అనకాపల్లి రూరల్, మార్చి 1 : ఈనెల ఏడో తేదీన అనకాపల్లిలో జరగనున్న ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన వెబ్‌ఎక్స్‌లో మాట్లాడారు. పిసినికాడ గ్రామం వద్ద ఎంపిక చేసిన స్థలంలో పూర్తిస్థాయి పనులు చేపట్టాలన్నారు. హెలిపాడ్ నిర్మాణం, సభాస్థలి ఏర్పాట్లు వేగంగా చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ వెబ్‌ఎక్స్‌లో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో చిన్నికృష్ణ, జయరాం, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు రోడ్డు దుస్థితి గుర్తుకొచ్చిందా : టీడీపీ

అచ్యుతాపురం, మార్చి1 : రోడ్ల దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యేకు ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు) అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించడంపై మండిపడ్డారు. టీడీపీ, జనసేన, ప్రజాసంఘాలు భారీ స్థాయిలో ఆందోళనలు చేసినా అధికారులు గాని, అధికార పార్టీ నాయకులు గాని స్పందించలేదని, ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఇప్పుడు రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. వీసీపీఐఆర్ నిధులతో రోడ్డుకి మరమ్మతులు చేయిస్తున్నామని కన్నబాబురాజు గొప్పగా చెప్పుకుంటున్నారని, ఆ నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించలేకపోయారన్నారు.

పేరుకే డిగ్రీ కాలేజీ!

... 5వ పేజీ తరువాయి

కేటాయించలేదు. రెండేళ్లపాటు (2022-23 విద్యా సంవత్సరం వరకు) కనీస స్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో ఈ కళాశాలలో చేరేందుకు స్థానిక విద్యార్థులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా సీట్లు ఖాళీగానే వున్నాయి. మొదటి సంవత్సరంలో బీఎస్సీ మ్యాథ్స్‌లో 15, కెమిస్ట్రీలో 15, బోటనీలో 20, బీకాం కంప్యూటర్స్‌లో 15 మంది వున్నారు. మొత్తం 180 సీట్లకుగాను 115 సీట్లు ఖాళీగా వున్నాయి. డిగ్రీ రెండో సంవత్సరంలో 36 మంది, ఫైనల్ ఇయర్‌లో 65 మంది విద్యార్థులు మాత్రమే వున్నారు. సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ లేకపోవడంతో విద్యార్థులు ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఈ ఏడాది అధ్యాపక పోస్టులను ఇంటర్మీడియట్ బోర్డు మంజూరు చేసింది. దీంతో ప్రిన్సిపాల్ సహా ఫిజిక్స్‌లో ఇద్దరు, మ్యాథ్స్, హిస్టరీలో ఒక్కొక్కరు చెప్పున రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. ఇంకా 10 మంది గెస్ట్ ఫ్యాకల్టీ, మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులు వున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం


కనకమహాలక్ష్మి ఆలయ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట, మార్చి 1 : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం ప్రారంభించారు. గోవింద కాలనీలో నిర్మించిన డ్రైనేజీలు, కల్వర్టులు, సచివాలయం-2 పరిధిలో నిర్మించిన రోడ్డు, రైల్వే ఎస్సీ కాలనీ, భవానీ కాలనీల్లో నిర్మించిన డ్రైన్లు, కల్వర్టులను ఆయన ప్రారంభించారు. కస్పావీధిలో నిర్మించిన రోడ్డు, సచివాలయం-1 పరిధిలో నిర్మించిన రోడ్డు, సచివాలయం-3 పరిధిలో ప్రత్యేక నిధులతో నిర్మించిన రోడ్డు, మేదర వీధి నుంచి కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు నిర్మించి సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం తాళ్లపాలెంలో గ్రామీణ నీటి పథకం, సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ కలగ లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, నాయకులు మళ్ల బుల్లిబాబు, లగిశెట్టి గణేష్, కొత్తపల్లి శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 1 : స్థానిక కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ శుక్రవారం కూడా న్యాయవాదులు రిలే దీక్ష కొనసాగించారు. ఈ దీక్షలో బి. శ్రీనివాసరావు, సూరిబాబులు కూర్చోగా పలువురు న్యాయవాదులు వీరికి మద్దతు పలికారు.

జనసేన నేతలు ప్రచారం ప్రారంభం


రామాలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 1: పట్టణంలో జనసేన నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణను ఖరారు చేయడంతో జనసేన నాయకులు, కొణతాల అభిమానులు శుక్రవారం విజయరామరాజుపేటలోని పలు ఆలయాల్లో కొణతాల రామకృష్ణ అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ పూజలు చేశారు. అలాగే ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, తాడి రామకృష్ణ, దూలం గోపి, టీడీపీ నాయకుడు ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన జడ్సీ


సచివాలయంలో మాట్లాడుతున్న జడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, మార్చి 1 : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత గవరపాలెం పరమేశ్వరి పార్కు జంక్షన్‌లోని మూడు సచివాలయాలను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే భీమునిగుమ్మం, పట్టణ బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. ఇదిలా ఉండగా జోనల్ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఇప్పటివరకు బకాయిలతోపాటు ప్రస్తుత ఆర్థికసంవత్సరం పన్నును ఒకేసారి ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని కోరారు. అలా చెల్లించిన వారికి వడ్డీమాఫీ వర్తిస్తుందని, ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు.

మందుబాబులపై చర్యలు చేపట్టాలి

పరవాడ, మార్చి 1 : వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని విసన్నపేటకి వెళ్లే ప్రధాన రహదారిలో మందుబాబులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని సర్పంచ్ శివలంక లక్ష్మి తెలిపారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారికి ఆనుకుని తాగి పడేసిన మద్యం బాటిళ్లతో పాటు డిస్పోబుల్ గ్లాసులు, ప్లేట్లు అక్కడే విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారవుతుందన్నారు. అలాగే మందుబాబులు మద్యం సేవించి వాహనాలు అతి వేగంగా నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలు దాటాక మందుబాబుల ఆగడాలు మొదలవుతున్నాయన్నారు. పోలీసులు నిఘా పెట్టి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ఆమె కోరారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఎలమంచిలి, మార్చి 1: ఏటికొప్పాకలో అగ్నిప్రమాదంలో పూరిల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కన్నబాబు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఎంపీపీ బోదెపు గోవింద్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బద్దపు యర్రయ్యదొర, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మర్రి రాజు, నేతలు పాల్గన్నారు.

మురుగు నీటికి మోక్షం

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


జంగాలకాలనీలో మురుగు నీరు కాలువ తవ్వుతున్న దృశ్యం

సబ్బవరం, మార్చి 1: సబ్బవరం శివారు జంగాలకాలనీలో మురుగునీటికి మోక్షం కలిగింది. ఈనెల 26న 'దారంతా మురుగు మయం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు స్పందించారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో జంగాలకాలనీ-వంగలి రోడ్డులో మురుగు నీరు ప్రవహించేందుకు కాలువలు తవ్వారు. మండల కేంద్రంలో మురుగు నీరు జాతీయ రహదారిపై ప్రవహించకుండా ఎక్కడికక్కడ ఇంకుడు గుంతలు తవ్వేందుకు తీర్మానం చేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇంకుడు గుంతలు తవ్వుతామని కార్యదర్శి మూర్తిబాబు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

» సీఐ వినోద్‌బాబు

కశింకోట, మార్చి 1 : ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఎం. వినోద్‌బాబు కోరారు. శుక్రవారం మండలంలోని విస్సన్నపేటలో ఎన్నికలపై గ్రామస్థులతో సమావేశమై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఏ విధమైన గొడవలు పడకూడదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అనేది ఎంతో కీలకమన్నారు. స్వచ్ఛమైన వాతావరణంలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ

- తప్పనిసరి చేసిన కంపెనీలు
- సిలెండర్ డెలివరీ బాయ్స్‌కు బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేత
- ఇళ్ల వద్ద కాని వారు కార్యాలయంలో చేయించుకోవాలని సూచన



నర్సీపట్నంలో వినియోగదారులకు ఈకేవైసీ చేయిస్తున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

నర్సీపట్నం, మార్చి 1 : వంట గ్యాస్ గృహ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి చేశారు. కేంద్రం ఉజ్వల పథకంలో భాగంగా వంట గ్యాస్‌పై రూ.307 రాయితీ ఇస్తుంది. దీంతో గృహ వినియోగ వంట గ్యాస్ పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈకే వైసీని అంతా చేయించుకోవాలని పేర్కొంటున్నారు. దీనికితోడు పలు రాజకీయ పార్టీలు ఎన్నికల్లో అధికారంలోకి వస్తే వంట గ్యాస్‌ను రాయితీపై ఇస్తామని హామీలు ఇస్తుండడంతో వినియోగదారులతో ఈకేవైసీని చేయించి సిద్ధంగా ఉంచడం మంచిదని ఆయిల్ కంపెనీలు భావిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. దీంతో ఆయిల్ కంపెనీలు వంట గ్యాస్ గృహ వినియోగదారుల నుంచి ఈకేవైసీ చేయిస్తున్నాయి. నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో 45వేల మంది హెచ్‌పీసీఎల్ గ్యాస్ గృహ వినియోగదారులు ఉన్నారు. గ్యాస్ నెంబరు, బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ అయ్యి ఉండాలని సూచిస్తున్నారు. వంట గ్యాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా నెంబరు, ఆధార్ కార్డు పట్టుకొని వచ్చిన వినియోగదారుల నుంచి స్థానిక కొత్తవీధి రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న ఆరుగురు గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు కూడా బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేశారు. ఇంటింటికీ గ్యాస్ డెలివరీ ఇచ్చే సమయంలో వినియోగదారుల నుంచి ఈకేవైసీ తీసుకుంటున్నారు. సర్వర్ సమస్యతో ఈకేవైసీ కానిపక్షంలో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి రావాలని సూచిస్తున్నారు.

'కుళాయిలకు మోటార్లు అమర్చితే చర్యలు'

రావికమతం, మార్చి 1 : ప్రభుత్వం ఇంటింటికీ వేసిన కుళాయిలకు కొంత మంది మోటార్లు అమర్చుతున్నారని, దీని వలన సమీప కుళాయిలకు తాగునీరు రావడం లేదని కొత్తకోట పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ శుక్రవారం తెలిపారు. తక్షణమే కుళాయిలకు ప్రైవేటుగా ఏర్పాటు చేసిన మోటార్లు తొలగించాలని కోరారు. గ్రామంలోని ఇంటింటి కుళాయిలు ఉన్న సోమిరెడ్డి వీధి, పెద సోపావీధి, మార్కెట్ ఏరియా వంటి కొన్ని ప్రాంతాలలో ఈ మోటార్ల మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ఆరోపించారు.. ఇక్కడ ఏ మాత్రం తాగునీరు రావడం లేదని పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు అందినట్టు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కుళాయిలకు మోటార్లు అమర్చుతున్న ప్రైవేటు ప్లంబర్లకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. ఇకపై ఎక్కడైనా కుళాయిలకు తమ తనిఖీలో మోటార్లు కనిపిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రెండు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

చీడికాడ/గొలుగొండ, మార్చి 1 : ఖండివరంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. ముగ్గురు వైద్యులు 412మంది రోగులకు పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. తొలుత ఈ శిబిరాన్ని ఎంపీపీ కురచా జయ మ్మ, ఎంపీటీసీ గెంజి స్వాతి, సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి ప్రారంభించారు. ఎంపీడీవో ఉమామ హేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎం. వీర్రాజు, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, గ్రామ పెద్దలు సుంకరి శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, గొలుగొండ మండలం జోగంపేటలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ బృందం పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. వేసవిలో ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ జువ్వల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

మాకవరపాలెం, మార్చి 1 : పల్స్ పోలియోపై తూటిపాల గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జరగనున్న ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల వరకు పోలియో చుక్కలు వేయించాలని హెచ్ఎం కె.రాము, వైద్య సిబ్బంది కోరారు.

పేరుకే డిగ్రీ కాలేజీ!

... 5వ పేజీ తరువాయి

కేటాయించలేదు. రెండేళ్లపాటు (2022-23 విద్యా సంవత్సరం వరకు) కనీస స్థాయిలో కూడా అధ్యాపకులు లేకపోవడంతో ఈ కళాశాలలో చేరేందుకు స్థానిక విద్యార్థులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా సీట్లు ఖాళీగానే వున్నాయి. మొదటి సంవత్సరంలో బీఎస్సీ మ్యాథ్స్‌లో 15, కెమిస్ట్రీలో 15, బొటనీలో 20, బీకాం కంప్యూటర్స్‌లో 15 మంది మాత్రమే వున్నారు. మొత్తం 180 సీట్లకుగాను 115 సీట్లు ఖాళీగా వున్నాయి. డిగ్రీ రెండో సంవత్సరంలో 36 మంది, ఫైనల్ ఇయర్‌లో 65 మంది విద్యార్థులు మాత్రమే వున్నారు. సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ లేకపోవడంతో విద్యార్థులు ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఈ ఏడాది అధ్యాపక పోస్టులను ఇంటర్మీడియట్ బోర్డు మంజూరు చేసింది. దీంతో ప్రిన్సిపాల్ సహా ఫిజిక్స్‌లో ఇద్దరు, మ్యాథ్స్, హిస్టరీలో ఒక్కొక్కరు చెప్పున రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. ఇంకా 10 మంది గెస్ట్ ఫ్యాకల్టీ, మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులు వున్నారు.

మినీ స్టేడియంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఆడిస్తుంటారు. అప్పుడప్పుడు రాజకీయ పార్టీల సభలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఇక్కడ నిర్వహిస్తుంటారు. ఇన్ని రకాల అవసరాలు తీరుస్తున్న ఎన్టీఆర్ మినీ స్టేడియం మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యానికి గురువుతున్నది. ఇటీవల మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డివైడర్ల మీద వున్న మూడు విగ్రహాలను తీసి, మునిసిపల్ ఏఈ రవి ఆదేశాలతో స్టేడియంలో తరలించారు. వాహనాలు లోపలికి రావడానికి వాకింగ్ ట్రాక్ కాంక్రీట్ గట్టును ధ్వంసం చేసి, మట్టితో నింపేశారు. 15 నుంచి 20 అడుగులు ఐరన్ రెయిలింగ్ రాడ్లు కట్ చేసి పట్టుకు పోయారు. వాకింగ్ ట్రాక్ మీద మట్టి పోయడం వల్ల వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక ర్యాంప్ మాదిరిగా వుండడంతో ఆకతాయలు ద్విచక్రవాహనాలతో నేరుగా స్టేడియంలోకి వచ్చేస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం స్టేడియం ప్రహరీగోడ, గేటు తీసేశారు.

మునిసిపల్ అధికారులు ఇటీవల ఒక ప్రైవేటు స్కూల్ వార్షికోత్సవానికి నామమాత్రపు రుసుముతో స్టేడియంను అద్దెకు ఇచ్చారు. డీజే సౌండ్ సిస్టమ్, టెంట్ సామగ్రితో వచ్చిన వాహనాలు డ్రైనేజీ మీద నుంచి వెళ్లడంతో సిమెంటు పలకలు ధ్వంసం అయ్యాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రహరీగోడను, ప్రధాన గేటును తొలగించారు. దీంతో రాత్రిపూట మందుబాబులు స్టేడియంలోకి వచ్చి మద్యం సేవిస్తున్నారు.

పడకేసిన పేదల ఇళ్లు!

... 5వ పేజీ తరువాయి

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్‌ను అప్పగించారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నేరుగా బిల్లులు చెల్లించకూడదు. దీంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు దశల వారీగా బిల్లులు మంజూరు అవుతాయని, అనంతరం 'ఆటో డెబిట్' కింద వెం టనే ఆ మొత్తం సొమ్ము ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బ్యాంకు ఖాతాలకు మళ్లించేలా బ్యాంకర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ మేరకు లబ్ధిదారుడు, కాంట్రాక్టరు, గృహనిర్మాణ సంస్థ జేఈలు ఒప్పంద పత్రాల(ఎంఓయూ)లపై సంతకాలు చేశారు.

గొలగాంలోని మూడు లేఅవుట్లలో 3,300 మందికి స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేశారు. వీటిల్లో ఇంతవరకు 185 ఇళ్లు మాత్రమే శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. పాపయ్యసంతపాలెం లేఅవుట్‌లో మొత్తం 450 ఇళ్లు వుండగా 50 ఇళ్లు పునాదుల వరకే పనులు జరిగాయి. మొత్తం మీద 1,850 ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. మిగిలిన ఇళ్ల (సుమారు 1,700) నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. కాంట్రాక్టర్ మొదటి విడత కింద రూ.3.5 కోట్ల విలువ చేసే పనులు పూర్తయిన తరువాత బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఆరు నెలల కిందట రూ.1.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగిలిన రూ.2 కోట్లు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. లేఅవుట్ల వద్ద ఇనుము, సిమెంట్, ఇసుక, పిక్క వృథాగా పడివున్నాయి. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడం, కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు ఆపేయడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

'తాండవ' ఎడమ కాలువ వద్ద భయం..భయం..

- గాంధీనగరం సమీపంలోని సైఫన్‌కు ఇనుప చట్రం కరువు
- నీటిలో కొట్టుకు వచ్చే మృతదేహాలను గుర్తించేందుకు తీవ్ర ఇబ్బందులు
- రిజర్వాయర్ అధికారులు వెంటనే స్పందించాలని పలువురు వేడుకోలు

నాతవరం, మార్చి 1 : తాండవ రిజర్వాయర్ అధికారుల నిర్లక్ష్యం పలువురిని భయాందోళనకు గురిచేస్తోంది. రిజర్వాయర్ నీరు పారేచోట చేపట్టాల్సిన పనులను జాప్యం చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాతవరం మండలంలోని తాండవ ఎడమ కాలువ పారే గాంధీనగరం వద్ద సైఫన్‌కు గతంలో ఇనుప చట్రం ఉండేది. అది క్రమేపీ తుప్పపట్టి పూర్తిగా పాడైన ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో ఈ ప్రాంతాన్ని చూసినవారు భయాందోళన చెందుతున్నారు.

గతంలో ఇక్కడ ఇనుప చట్రం ఉన్నప్పుడు ఎడమ కాలువలో నీరు ప్రవహించే సమయాల్లో గంగవరం, నాతవరం, మాధవనగరం తదితర గ్రామాలలో ప్రమాదవశాత్తు ఎవరైనా పడి చనిపోతే కొట్టుకుంటూ వచ్చే మృతదేహాలు గాంధీనగరం సైఫన్ ఇనప చట్రం వద్ద ఆగిపోయేవి. దీంతో సంబంధీకులు వచ్చి మృతదేహాలను తీసుకువెళ్లడమో లేక పోలీస్, రెవెన్యూ, రిజర్వాయర్ అధికారులకు సమాచారం అందించడమో చేసేవారు. అలాగే, సైఫన్ వద్ద గల కాలువ మెట్లపై బట్టలు ఉతికేవారు కూడా తమక ప్రమాదం ఉండేది కాదని చెపుతున్నారు. అయితే రెండేళ్ల క్రితం ఇక్కడి ఇనుప చట్రం తుప్పు పట్టడంతో మాయమైంది. దీంతో కాలువలో పడిన వారి మృతదేహాల ఆచూకీ కనుగోవడం కష్టతరంగా మారుతోంది. ఒక్కోసారి రెండు, మూడు రోజులు వెతకాల్సి వస్తోందని చెపుతున్నారు. ఇటువంటప్పుడు ఖరీఫ్ పంటలకు నీటిని విడుదల చేసే సమయాల్లో తాత్కాలికంగా నీటిని నిలుపుదల చేసి వెతకాల్సి వస్తోందని అంటున్నారు. రిజర్వాయర్ అధికారులు స్పందించి గాంధీనగరం కాలువ వద్ద సైఫన్‌కు ఈ వేసవిలోనే ఇనుప చట్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



గాంధీనగరం సమీపం తాండవ ఎడమ కాలువ వద్ద సైఫన్‌కు ఇనపచట్రం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష



నర్సీపట్నంలో పరీక్ష రాసేందుకు హాలులోకి వెళుతున్న విద్యార్థినులు



కృష్ణాదేవిపేట కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు



చోడవరం కేంద్రం నుంచి పరీక్ష అనంతరం బయటకు వస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

నర్సీపట్నం, మార్చి 1 : ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నర్సీపట్నంలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షకు వెళ్లే ముందు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల దుర్గామల్లేశ్వరస్వామి, ఐదు రోడ్ల కూడలిలోని బాలవినాయక ఆలయం వద్ద విద్యార్థులు పూజలు చేశారు. ఉదయం 8.30కు కేంద్రాలకు చేరుకొని హాల్ టిక్కెట్టు నెంబరు ఆధారంగా పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు సాధారణ రిస్ట్‌వాచ్‌లను సైతం అనుమతించక పోవడంతో ఎంట్రన్స్ గేటు వద్దే పడేసి లోపలకు వెళ్లాల్సి వచ్చింది.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జరిగిన ప్రథమ పరీక్షకు 226మందికి గాను 219మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు తెలిపారు.

చోడవరం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, ఉషోదయ, శ్రీవిజ్ఞాన్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మూడు కేంద్రాల్లో తొలిరోజు 1180 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 1135 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

రావికమతం : కొత్తకోట కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రావికమతం కళాశాలతో పాటు, రోలుగుంట కేజీబీవీ, మరుపాక మోడల్ స్కూల్ నుంచి 282మంది రాయాల్సి ఉండగా, 276 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్టు చెప్పారు.

మాడుగుల : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం తొలి పరీక్షకు 238 మంది హాజరు కావాల్సి ఉండగా, 228 మంది మాత్రమే పరీక్ష రాసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ నాగ మోహిని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా చేసినట్టు చెప్పారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు మొత్తం 247 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 22 మంది గైర్హాజరయ్యారు. పది గదుల్లో పరీక్షల నిర్వహించినట్టు చీఫ్ సూపరెండెంట్ ఉమామహేశ్వరీ తెలిపారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- ఎస్ఐలు సురేష్, కృష్ణారావు

రోలుగుంట, మార్చి 1 : రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాల్సిందిగా ఎస్ఐ సురేష్ కోరారు. శుక్రవారం రాత్రి నిండుగొండలో ప్రధాన పార్టీల నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు, అక్రమ మద్యం, గిఫ్టులకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుర్ల బాబులునాయుడు, శెట్టి రాజారావు పాల్గొన్నారు.

గొలుగొండ : ఎన్నికలకు సజావుగా నిర్వహించేందుకుగా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు తమకు సహకరించాల్సిందిగా ఎస్ఐ కృష్ణారావు కోరారు. మండలంలోని అమ్మపేటలో శుక్రవారం ప్రజలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు స్థానికులకు తెలిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక సర్పంచ్ నిద్ర దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేనపై ప్రజలకు అపార నమ్మకం'

చోడవరం, మార్చి 1 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి నియోజకవర్గంలో గురువారం చేపట్టిన పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మూర్తియాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో లేనప్పటికీ ప్రజలు భువనేశ్వరి పట్ల చూపించిన ఆదరణ ఆప్యాయత చూస్తుంటే, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పట్ల ప్రజల్లో ఎంత నమ్మకం ఉందో అర్థమవుతుందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో భువనేశ్వరి కార్యక్రమానికి హాజరైన ప్రజలను చూస్తే, రాష్ట్రంలో సైకో జగన్ పాలన పట్లప్రజలు ఎంత విసుగెత్తి ఉన్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చునన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ఎంత డబ్బు వెదజల్లినా జనం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు పట్టం కట్టడం తథ్యమని స్పష్టం చేశారు.

లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలు పంపిణీ



కోటపాడులో హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న బూడి

దేవరాపల్లి, మార్చి 1 : మండలంలోని బి.కింతాడలో భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా 980 మందికి శాశ్వత భూహక్కు పాసు పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం తారువ గ్రామంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరే బాబూరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు : ఇక్కడి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం పలువురు గృహ నిర్మాణ లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వంలోనే పేదుల సొంతింటికల నెరవేరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ అధికారులు రామాలయం సందర్శన

కె.కోటపాడు, మార్చి 1 : తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మండలంలోని వారాడ శివారు ఎడ్లవానిపాలెంలో గల రామాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పురాణ పండితులు ఎస్‌కే చంద్రమౌళీశ్వర శర్మ సత్యనారాయణ ఆలయ పరిసరాలను పరిశీలించి, పలువురు భక్తులతో మాట్లాడారు. ఇక్కడి రామాలయానికి మూలవిరాట్ విగ్రహాలను అందజేసేందుకు తగిన అనుకూల పరిస్థితులను పరిశీలించేందుకు ఇక్కడకు వచ్చినట్టు చెప్పారు. ఉన్నతాధికారులకు ఇక్కడి అంశాలను తీసుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యురాలు ఎడ్ల రమణమ్మ, గొర్రెపోటు వెంకట్రావు, గనివాడ సత్యం, ఎడ్ల సన్నిబాబు, వెంకునాయుడు, సత్యనారాయణ, ఎడ్ల సింహాద్రిలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా అడవిరాజులబాబు పండగ

నాతవరం, మార్చి 1 : మండల కేంద్రం నాతవరంలో శుక్రవారం అడవిరాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారమ్మ ఇంటి నుంచి గ్రామస్థులంతా డప్పుల వాయిద్యాలు, తప్పెటగుళ్లు, బాణసంచా కాల్పుల నడుమ భారీ ఊరేగింపుగా అడవిరాజులబాబు వనం వద్దకు తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. సాయంకాలం నాతవరంతో పాటు మర్రిపాలెం. గుమ్మిడిగొండ, జిల్లేడిపూడి తదితర గ్రామాలలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కృష్ణాదేవిపేట, : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజుబాబుల పండగను ఘనంగా నిర్వహించారు. కొంగసింగి, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, సీహెచ్. నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, కొండగోకిరి, విప్పలపాలెం తదితర గ్రామాల్లో ఉదయాన్నే పొలాల్లో చెట్లు, గుడి వద్దకు వెళ్లి అడవిరాజుబాబులకు పూజలు జరిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. వివిధ పార్టీల నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నాతవరంలో ఊరేగింపుగా అడవిరాజులబాబు గుడికి వెళుతున్న భక్తులు

పంచాయతీ పారిశుధ్య కార్మికులు దీక్ష విరమణ



కార్మికులతో చర్చలు జరుపుతున్న పంచాయతీ అధికారులు

చోడవరం, మార్చి 1 : వేతన బకాయిల కోసం నిరాహార దీక్ష చేపట్టిన ఇక్కడి పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఆందోళనను విరమించారు. ఆరు నెలలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో నాలుగు రోజులుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు శుక్రవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, పారిశుధ్య కార్మికులతో చర్చలు జరిపారు. బకాయిపడిన వేతనాల్లో రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించేందుకు, ఈనెల 20వ తేదీలోగా మరో రెండు నెలల వేతనాలు, మిగిలినవి కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేయడంతో కార్మికులు దీక్షను విరమించి విధులకు హాజరవుతున్నట్టు ప్రకటించారు. ఈ చర్చల్లో పంచాయతీ అధికారి చిన్నారావు, నాయకులు బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ కార్డుదారుల ఈకేవైసీ పూర్తిచేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

రోలుగుంట, మార్చి 1 : మండలంలోని పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌డీవో ఉదయశ్రీ ఆదేశించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. మండలానికి సంబంధించి 14700 కార్డులు వచ్చాయని, వీటిలో ఇప్పటికే 11800 పంపిణీ చేశామన్నారు. మిగిలిన కార్డులకు సంబంధించి ఆయా పేర్లు గలవారితో ఈకేవైసీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ నూకరాజు పాల్గొన్నారు.

గవరవీధిలో ఘనంగా రాములవారి తీర్థం



భక్తుల పూజలందుకున్న స్వామివారు

మాడుగుల, మార్చి 1 : పట్టణంలోని గవరవీధిలో సీతారాముల తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

5న ఎం.కోటపాడులో వీరాంజనేయ వేడుక

మాడుగుల రూరల్, మార్చి 1 : ఎం.కోటపాడులో వీరాంజనేయస్వామి తీర్థం ఈ నెల ఐదో తేదీ మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తారువలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులకు నివాళి



అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చోడవరం, మార్చి1 : ఎస్సీ వర్గీకరణ పోరులో ప్రాణాలు కోల్పోయిన వారికి శుక్రవారం ఇక్కడి అంబేడ్కర్ భవనంలో మాదిగ ఉద్యోగుల సంఘం, రెల్లి హక్కుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు కండెల్లి వెంకటరావు, అత్తోటి వజ్రభూషణం, రెల్లి హక్కుల పోరాట సమితి నాయకులు ఎర్రంశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలతో భవిష్యత్తు చిత్తు'

కృష్ణాదేవిపేట, మార్చి 1 : సారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని ఎస్ఈబీ గొలుగొండ ఎస్ఐ ఎస్.కె.రహిమాన్ సూచించారు. చోద్యం గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. సారాను తయారు చేయడం, తాగడం చట్టరీత్యా నేరమన్నారు. మత్తుపదార్థాలకు అంతా దూరంగా ఉంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఎన్నికలపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి'



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

రోలుగుంట, మార్చి 1 : ఎన్నికలపై ప్రతి కార్యకర్త ప్రత్యేక దృష్టి సారించాలని విప్ ధర్మశ్రీ పిలుపునిచ్చారు. కొమరవోలులో శుక్రవారం ఏర్పాటు చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతి బూత్‌లో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు గొర్లె రామన్, నాయకులు చెల్లమ్మనాయుడు, పోతల శ్రీనివాసరావు, తమరాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'నేటి నుంచి టిడ్కో గృహాలు అప్పగింత'



టిడ్కో గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 1 : మునిసిపాలిటీలోని లబ్ధిదారులకు సచివాలయాల వారీగా శనివారం నుంచి టిడ్కో గృహాలను అప్పగిస్తామని ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. శుక్రవారం కసిమి రోడ్డులోని టిడ్కో గృహాలను అధికారులతో కలిసి సందర్శించి మాట్లాడారు. ఈ గృహాలకు విద్యుత్, నీరు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన చిన్నచిన్న పనులు పూర్తి కావడానికి రెండు నెలలు సమయం పడుతుందని వివరించారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కమిషనర్ రవి బాబు, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.

'నాగాపురం వైసీపీ నాయకులకు చౌకబారు ఆరోపణలు తగవు'



విలేకరులతో మాట్లాడుతున్న రామారావు

కృష్ణాదేవిపేట, మార్చి 1 : ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడి నాగాపురంలో టీడీపీ కార్యకర్తలను వైసీపీకి చెందిన సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు తమవెంట తిప్పుకున్నారని, తీరా సదరు కార్యకర్తలు సొంతగూటికి చేరడంతో ప్రస్తుతం తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని నాగాపురం మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ సీనియర్ నాయకుడు బొప్పన ప్రసాద్ తదితరులు ఆరోపించారు. శుక్రవారం గ్రామంలో కొత్తగా చేరిన వారితో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో 'పాత వారికే కొత్త కండువాలు' శీర్షికతో అధికార పార్టీకి చెందిన పత్రికలో కథనం ప్రచురించడం దారుణమన్నారు. గ్రామంలో సర్పంచ్ రఘురామచంద్రరావు పనితీరు, పథకాల కోసం లబ్ధిదారులను బెదిరింపులకు పాల్పడడం తదితరాలను చూసి వైసీపీకి వెళ్లిన కార్యకర్తలు తిరిగి టీడీపీ గూటికి చేరారన్నారు. దీనిపై తప్పుడు రాతలు రాయడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కలం నాగేశ్వరరావు, అప్పన సత్తిబాబు, పల్లా రాజుబాబు, కంకిపూడి మంగరాజు, మర్రి చిన వెంకటరమణ, సేనాపతి వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.